

# మార్గదర్శి

ఇనుగంటి జానకి

నా కొడుకు సుధీర్ గదిలో అలారం వాచ్ మ్రోగింది. నేను డ్రాయింగ్ రూమ్‌లో సోఫా కం బెడ్‌పై పడుకుని ఉన్నాను. నేను నా గదిలో గోడగడియారం వైపు చూసాను. ఉదయం నాలుగు అయింది. రాత్రి వంటి గంటకు సుధీర్ వచ్చాడు. కొడుకు కోడలూ ఇద్దరు కార్పొరేట్ కంపెనీలో ఉన్నతోద్యోగులే అని చెప్పుకోవటానికి గొప్పగావున్నా వీళ్ల బ్రతుకు విధానం చూస్తూవుంటే బాధగానే ఉంది. నేను బెంగుళూరు వచ్చిన కొత్తలో కొడుకు, కోడలు ఏ ఒక్కరు ఉదయం ఉద్యోగానికి బయలుదేరినా గమనించి వంట గదిలోకి వెళ్లి కాఫీ కాచి తెచ్చే దానిని. వాళ్లు హడావిడిగా కాఫీ త్రాగటం మరచి వెళ్లిపోయేవారు. వాళ్లు వెళ్లాక నేను వంటరి దాననే. వాళ్లు ఇంటిలో ఉన్నా నాతో క్లుప్తంగా మాట్లాడేవారు. కొత్తకాపురం... వారు ఇరువురూ కలసివున్న సమయం కూడా తక్కువే.

ఈ అపార్ట్‌మెంట్‌లో ఉన్నవారు చాలా మంది ఉన్నతోద్యోగులే. ఎవరి హడావిడి వారిదే. నేను విశాఖపట్నం వెళ్లిపోదామని నిర్ణయించుకుని సుధీర్‌తో చెప్పాను. 'వెళ్లి ఏమి చేస్తావు?' అని అడిగాడు. చేసేదిలేక 'అందరినీ చూసి వచ్చేస్తాను' అని జవాబు చెప్పాను. సుధీర్ అభ్యంతరం చెప్పలేదు.

ట్రైన్ టైమ్‌కి సుధీర్ నన్ను స్టేషన్‌కి తీసుకొచ్చి నా రిజర్వ్‌బెర్త్ ఉన్న కంపార్ట్‌మెంట్‌లో కూర్చోబెట్టాడు. నడుస్తున్న రైలు నుంచి దూరమవుతున్న కొడుకు ముఖంలోకి దీక్షగా చూసాను. పెద్దగా బాధపడినట్లు అనిపించలేదు. నా కళ్లు మాత్రం చెమ్మగిల్లాయి. నేను వెళ్తున్నానే గాని విశాఖలో అంత పెద్ద బంగళాలో ఒంటరిగా ఉండలేను. అందుకే సుధీర్ పెళ్లి తర్వాత సుధీర్, కోడలు బెంగుళూర్ వచ్చేసాక నేను సుధీర్ వద్దకు వచ్చేసాను. వచ్చేముందు అక్కకి చెప్పలేదు. మరి ఇప్పుడు ఏం చెయ్యాలి? నాకు నా భర్త రాఘవ జ్ఞాపకం వచ్చారు. ఆయన నా సుఖంలోనే తన సుఖం వెతుక్కునేవారు. నన్ను క్షణం కూడా విడిచి ఉండలేకపోయేవారు. రాఘవ పోయాక నేను ఒంటరిదాన్ని అయ్యాను. రాఘవ తండ్రిని మించిన తనయుడు అనిపించుకోవడానికి అహర్నిశలూ కష్టపడినా, నా విషయంలో ఎప్పుడూ అశ్రద్ధ చూపలేదు. నా బెర్త్‌పై పడుకొని ముఖాన్ని దుప్పట్లో దాచుకుని ఏడ్చాను.

నాకు అక్క గుర్తొచ్చింది. ఆమె తన జీవితాన్ని ఆ పద్ధతిలో ఎందుకు మళ్లించిందో ఇప్పుడు అర్థం అయింది. అక్క సుధీర్ పెళ్లికి రాలేదు. సుధీర్‌ని పెళ్లికొడుకుని చేసినప్పటి నుంచి పెళ్లి అయి, కోడలు గృహప్రవేశం చేసేవరకూ గంట గంటకూ ఫోన్‌చేసి నేను అక్కని పిలుస్తూనే ఉన్నాను. గతం నెమరువేసుకుంటూ అలాగే పడుకొని వున్నాను.

సుధీర్ పెళ్లి నిశ్చయమైంది. వీలైనంత త్వరగా అక్కకి చెప్పాలి. నాలో ఉత్సాహం... కారులో బయలుదేరాను. విజయనగరం ఊరు చివర కొత్తగా కట్టిన భావనా అపార్ట్‌మెంట్ పార్కింగ్ ప్లేస్‌లో కారు ఆగింది. నేను హుషారుగా కారు డోర్‌తీసి దిగాను.

రెండొకట్లు రెండూ... రెండురెళ్లు నాలుగూ, భూమి గుండ్రంగా... బంతి ఆకారంలో ఉంది. బంతి... భూమి గుండ్రంగా... పిచ్చుక, కాకి, గ్రద్ద పావురం వీటన్నిటిని పక్షులంటారు. మన భారత్ తొలి ప్రధాని... తొలిప్రధాని జవహర్ లాల్‌నెహ్రూ. తొలి ప్రధాని...

ఇలా అన్ని పదాలూ కలగలిపి గోలగోలగా వినిపించాయి. అటు తిరిగి చూసాను. చిన్న సైజు ఎలిమెంటరీ స్కూల్లా ఉంది. అక్కడి వాతా

వరణం. ఆమధ్యలో చేతిలో బెత్తం పట్టుకొని అటూ, ఇటూ తిరుగుతోంది అక్క.

'మేడమ్! నాక్కాస్త బజార్లో పని ఉంది. ఎంతసేపట్లో తిరిగి రమ్మంటారు?' డ్రైవర్ అడుగుతున్నాడు.

వెళ్లిరా! రెండుగంటల తర్వాత రా... అని చెప్పి అక్కవైపు నడిచాను. ఆ పిల్లల మధ్య కాస్త వంగి నిలబడి పిల్లలతో స్వరం కలిపితే? అక్క నన్ను గమనిస్తుందా లేదా చూడాలి. ఈ ఆలోచన వచ్చాక నా పెదవులపై చిలిపిగా నవ్వు విరిసింది. నేను మెల్లగా అటువైపు నడవటం ప్రారంభించాను. దగ్గరగా వచ్చేసరికి మెతక కంపు. నేను వారిని గమనించగా సంస్కార రహితంగా ఉన్న తలలు, చిరిగి మాసిపోయిన బట్టలు... అందరూ బాగా పేద కుటుంబానికి చెందిన వారిలా కనబడుతున్నారు. నేను అక్కడ నుంచే 'అక్కా' అని పిలిచాను.

నిమ్మీ!... నన్ను చూసి అక్క సంతోషంగా పిలిచింది. ఎన్నాళ్లకు విన్నానా పిలుపు? నా పేరు నిర్మల. కానీ అక్క నన్ను నిమ్మీ అనే పిలుస్తుంది.

'నిమ్మీ! నేనిప్పుడే వస్తాను. నువ్వెళ్లి గదిలో కూర్చో' అంటూ తాళం అందించింది. తాళం తీసి అక్క గదిలోకి ప్రవేశించాను. ఆ గదిలో కొన్ని వంటసామాన్లు ముఖ్యంగా అవసరమైన అతి కొద్దిసామాన్లు తప్ప అంతా ఖాళీగానే ఉంది. సింప్లిసిటీ ఈజ్ బెస్ట్ పాలసీ... అన్నారు. నిజమే! కానీ ఇంతగానా? అనిపించింది.

అయినా ఎలా బ్రతకవలసింది ఎలా బ్రతుకుతోంది? అని కూడా అనిపించింది. అయినా అక్క జీవితమే అంతేమో! ఎవరైనా అవకాశాలు రాక బాధపడతారు. కాని అక్క విషయంలో ఆ బాధ లేదు. కానీ వచ్చిన అవకాశాలు తృటిలో తప్పిపోవడం కొంతైతే, ఆమే తనంత తాను గా తప్పించుకున్నవెన్నో.

ఇప్పటికైనా అక్కకి ఏమీ లోటు లేదు. ప్రభుత్వోద్యోగిగా పదవీ విరమణ చేసింది. పెన్షన్ వస్తుంది. అంతేకాదు... రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కొన్ని లక్షలు వచ్చాయి. అక్క ఆర్థికంగా దృఢంగానే ఉంది. అయినా తను జీవితంలో ఎందుకిలా గడుపుతోంది? అదికాక ఆ చిన్న చిన్న పిల్లలకు ప్రైవేట్లేమిటి? వాళ్లేమిస్తారని? ఏమివ్వగలరని? దేన్ని ఆశించి ఈ పని చేస్తోంది? సుఖానున్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకోవడం అంటే ఇదేనేమో. ఆ రోజు అక్క గదిలో కూర్చుని నేను చాలాసేపు ఇలా ఆలోచిస్తూనే వుండిపోయాను. అక్క రావటం కూడా గమనించలేదు.

ఏమిటి ఆలోచిస్తున్నావు? అక్క గొంతు వినిపించి వర్తమానంలోకి వచ్చాను. 'అక్కా! ఈ ఊరి చివర ఈ స్లమ్ ఏరియా దగ్గరలో ఈ అన్‌డెవలప్‌డ్ ఏరియాలో, ఈ గుడిసెల మధ్య ఈ గదిలో ఒంటరిగా బ్రతకడం ఎందుకు?' సూటిగా అడిగాను.

అవేమీ పట్టించుకోనట్టు 'నాకేం! నేను సంతోషంగానే జీవిస్తున్నాను' ఒక్క మాటలో బదులిచ్చింది. ఆ ముఖంలో ఏ భావమూ లేదు.

'నువ్వు ఒక్కర్తివి ఉంటూ సంతోషంగా ఉన్నానని నువ్వనుకోవచ్చు కానీ నీవాళ్లం మేము న్నాము. అంత పెద్ద బంగళాలో రాఘవ పోయాక నా కొడుకూ, నేనూ ఒంటరివాళ్లం అయ్యాం. నువ్వు కూడా వచ్చి ఉంటే పెద్దదానివి అని...' ఇంకా ఏదో అనబోయాను.

నా మాట పూర్తికాకముందే 'నిమ్మీ! నేనీ ప్రదేశం విడిచి ఎక్కడికీ రాలేను. ఎందుకంటే నా చుట్టూ ఉన్న ఈ అమాయకులే కారణం. వీళ్లు కూటికి పేదవారు కావచ్చు కానీ, వీళ్లు

మంచి మనుషులు. జీవితం అందరికీ అన్ని సదుపాయాలూ సమకూర్చదు. లోకంలో అన్నీ డబ్బు ఇచ్చి, కొనుక్కోవచ్చునేమో కానీ ఆప్యాయత, అభిమానం ఇచ్చిపుచ్చుకోవాలి. వీళ్ల కష్టసుఖాలలో నేను కాస్త సాయం చేస్తాను. ఈ అమాయకుల కళ్లల్లో కన్పించే కృతజ్ఞత చాలు జీవితం సుఖంగా గడిపేయడానికి. అదే నన్నిక్కడ కట్టిపడేసింది' అంది అక్క.

టికెట్... టికెట్ కలెక్టర్ వచ్చి అడిగాడు. నేను టికెట్ తీసి చూపించాను. కాసేపు నా చుట్టు పరిశీలనగా చూశాను. లాభంలేదు అక్క ధ్యాసే. మరి ఏమీ తోచలేదు. ఈ రోజు అక్క చుట్టూనే తిరుగుతోంది నా మనసు.

ఆనాడు అక్క సాహసంగా నా జీవితాన్ని చక్కదిద్దింది. నేను హాయిగా, హోదాగా జీవితం గడుపుతున్నాను. ఇది అక్క చలవే. అక్క స్వభావం సహజంగా ఎదుటివారి కోసం త్యాగం చేయటం. నేను చిన్నప్పటి నుంచీ ఎరిగినదే. కానీ చెప్పటానికీ వినడానికీ ఆదర్శం బాగుంటుంది. నిజానికి నా అన్నవారు ఆదర్శంగా, కఠినంగా జీవిస్తూ ఉంటే వారిని చూసి మనసు బాధ పడుతుంది. అక్క ఇలా జీవించడం నాకు నచ్చలేదు. నా దృష్టిలో అవకాశాన్ని బట్టి సుఖపడాలి. రాఘవ ఉన్నప్పుడు అక్క మా ఇంటికి వచ్చినప్పుడైనా మాతో కలిసి సినిమా, పార్క్, షాపింగ్, హోటల్‌కి, తిరగడానికి రమ్మంటే ఏదో సాకు చెప్పి వచ్చేదికాదు. మా ఇంటిలో పనిచేసే వారి కష్టసుఖాలు చనువుగా అడిగి తెలుసుకునేది. చేతనైనంత సాయం కూడా చేసేది. రాఘవ కోపంగా 'బాబోయ్! మీ అక్క!... ఆవిడ ఆరిందా. తనేదో పెద్ద సంఘసేవకురాలనుకుంటోంది. తనకు తానే పెద్దరికం తెచ్చిపెట్టుకుంటోంది' అని ఆక్షేపణగా మాటలాడినప్పుడు, నాకు నిజమే అనిపించినా, నేను మాట పట్టుదలకు 'చేతనైతే మీరు కూడా నలుగురికీ సేవ చెయ్యండి. అందరూ మిమ్మల్నీ పొగుడుతారు' అనేదానిని.

ఆ రోజు అక్క సుధీర్ బాగున్నాడా? ఏమిటి విశేషాలు? అని అడిగినప్పుడు. నాకు నేను ఇక్కడికి వచ్చినకారణం జ్ఞాపకం వచ్చింది. నేను నా బ్యాగ్‌లోంచి ఫొటో తీసి అక్కకు చూపిస్తూ 'అక్కా! ఈ అమ్మాయి బాగుందా?' అని అడిగాను. అక్క ఫొటో చూస్తూ "విషయం ఏమిటో చెప్పు" అని అడిగింది. నేను అక్కతో సుధీర్‌పెళ్లి నిశ్చయమైన విషయం చెప్పాను. ఆనాడు నా పెళ్లి విషయం, ఈనాడు సుధీర్ పెళ్లి విషయం ... నిశ్చయం అయ్యాకే చెప్పినా అక్క కోపగించుకో లేదు. ఉత్సాహంగా 'అమ్మాయి ఫొటోలో చాలా బాగుంది. పెళ్లి చేసేయి. కోడలొస్తే పిల్లాపాపలతో ఇల్లు కళకళలాడుతుంది. ఇక సందడే సందడి' అంది.

అక్క జీవితం ఒంటరిగా గడిపినా ఎదుటివారు విందుగా పదికాలాల పాటు సుఖంగా జీవించాలి అని కోరుకుంటున్నది. పాపం అక్క... నా మనసులో బాధ.

'కాఫీ... కాఫీ మేడమ్! కాఫీ కావాలా?' కాఫీ అమ్ముతున్న అబ్బాయి అడిగాడు. ఒక కప్పు తీసుకుని త్రాగాను. కిటికీ నుంచి బయటకు చూసాను. గడిచిన నా గతంలా పారిపోతున్నాయి పచ్చని చెట్లు. రైలు ముందుకు సాగుతోంది. నా మనసు మాత్రం గతాన్ని తలుస్తున్నది.

అక్క గదిలో కూర్చుని మాట్లాడుకుంటున్నాము. క్రింద నుంచి ఎవరిదో ఏడుపు, ఇంకా అరుపులు వినిపించాయి. 'ఇప్పుడే వస్తాను' అని అక్క వెళ్లిపోయింది. నేను లేచి కిటికీలో నుంచి బయటకు చూసాను. ఒక అబ్బాయి ఏడుస్తూ

న్నాడు. ఒక నడివయసు వ్యక్తి అరుస్తున్నాడు. అక్క అతడికి బోధపరుస్తోంది. ఆ మనిషి అరవడం మానేశాడు. అబ్బాయి ఏడుపు ఆపాడు. కాసేపయ్యాక అక్క తిరిగి వచ్చింది.

నేనేమీ అడగకముందే అక్క చెప్పటం ప్రారంభించింది. "ఆ అబ్బాయికి చదువుకోవాలని ఉంది, కాని వాడి అయ్య వాడిని కూలికి వెళ్లమంటాడు. అయితే అందులో అతడి తప్పు లేదనుకో... తండ్రీ కొడుకులు కష్టపడి కూలి చేసి డబ్బు తెస్తేనే ఇల్లు గడుస్తుంది' అంటూ నావైపు చూసింది.

నేను సమాధానం చెప్పలేదు. అక్క చెప్పటం ప్రారంభించింది. "ఆ అబ్బాయి రోజూ నాదగ్గర కొచ్చి చదవడం మొదలుపెట్టాడు. శ్రద్ధగా చదువుతాడు. చెప్పిన వెంటనే గ్రహిస్తాడు. అందుకే వాళ్ల నాన్న వచ్చి తీసుకుపోతానన్నా నేను ఇష్టపడను. కావాలంటే ఆ కూలి డబ్బులు నేనే సాయంచేస్తా అని చెప్పాను" అంటూ ఇంకేదో చెప్పబోయింది.


మరి నేను ఓపిక పట్టలేకపోయాను. 'అక్కా! ఇలా ఏ ఒకరిద్దరికో సాయం చేసినంత మాత్రాన పరిస్థితులేమీ మారవు. ఓ పదిమంది పిల్లలు చదివినంత మాత్రాన దేశం బాగుపడిపోదు. నువ్వెంత డబ్బు సాయంచేసి నా వీళ్ల పేదరికం తీరుతుందనుకుంటున్నావా? నీ ఉద్దేశ్యం ఉన్నతమైనదే. కానీ నీ ఒక్కదాని వలన ఈ పరిస్థితి మారదు. ప్రభుత్వం, ఎందరెందరో ఎన్నెన్నో పథకాలు, ప్రణాళికలూ వేసినా, సమాజం మారాలంటే మూఢత్వం పోవాలి. అలా జరగడానికి ఏదో పెద్ద విప్లవం రావాలి. ఏ ఒక్కరిద్దరివల్లో విప్లవం రాదు. అయినా ఇవన్నీ జరిగే మాటలు కావులే" అన్నాను ఆవేశంగా.

నా మాటలకు అక్క నవ్వి 'మొదట మనం ఒకడుగు వెయ్యడం మొదలుపెడితే రెండో అడుగు అదే పడుతుంది. అలాగే నా జీవితం కూడా ధన్యమౌతుంది" అంది. నేనేదో జవాబు చెప్పేటంతలో డ్రైవర్ రావడంతో పెళ్లికి ముందుగా రమ్మని చెప్పి బయలుదేరాను.

అమ్మానాన్నలకి మేము ముగ్గురు పిల్లలం. అన్న, అక్క, నేను. చిన్నదానిని కావడంతో కాస్త గారాబంగా చూసుకునేవారు. నాన్న ప్రభుత్వోద్యోగి. స్వంత ఇల్లు ఉండేది. అన్న ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్. అక్క బి.యస్సి. ఫైనల్. నేను బి.ఎ. ఫస్ట్ ఇయర్ చదువుతున్నప్పుడు నాన్న గుండెపోటుతో మరణించారు. సజావుగా సాగిపోతున్న మా కుటుంబనౌక సుడిగుండాల్లో చిక్కుకున్నట్లు అయింది. అమ్మకే కాదు మాకెవరికీ కూడా ఏమీ పాలుపోలేదు.

అందరికంటే ముందుగా తేరుకుంది అక్కే. ధైర్యం తెచ్చుకొని ముందడుగు వేసింది. ఆ ప్రయత్నాలలో భాగంగానే నాన్నగారి ఉద్యోగం ఆమెకొచ్చింది. కుటుంబ బాధ్యతంతా ఆమె భుజాన పడింది. మా చదువులు ఆగిపోలేదు. కుటుంబ పరిస్థితి యధాప్రకారంగా సర్దుకుంది. కాకపోతే అక్కకే ఏ వయసులో జరగవలసిన ముచ్చట్లు ఆ వయసులో జరగలేదు. అప్పుడు మేం పట్టించుకోలేదు. దానికి కారణం నేను, మా అన్నే ఒకరకంగా.

నేను ఫైనలియర్ చదువుతున్నపుడు L.L.B చదువుతున్న రాఘవని ప్రేమించాను. రాఘవ వాళ్లు మా కన్నా బాగా కలిగినవాళ్లు. రాఘవ నాన్నగారు పేరుమోసిన లాయర్. కానీ మా కులం వాళ్లు కాదు. అప్పటికే మా ప్రేమ హద్దులు మీరిందని గ్రహించిన అక్క ఇల్లు అమ్మేసి, మా పెళ్లి చేసింది. ఆ సంఘటనతో మా అన్నయ్య అదే సాకుగా చూపించి ఇంట్లోంచి వెళ్లిపో




యాడు. దానికి కారణం అన్నయ్య చదువు పూర్తయి ఓ దారి దొరకడమే.

పెళ్లై నేను ఇల్లు వదిలిన నాటి నుంచి అన్నయ్య అమ్మ, అక్కల విషయాలు పట్టించుకోలేదు. అక్కకి పెళ్లి కాలేదని, అమ్మ సంరక్షణ కోసం అలాగే ఉండిపోయిందని కనీసం నేనైనా ఆలోచించలేదు. కానీ ఇప్పుడనిపిస్తోంది. అక్క ఈ సంఘసేవనెందుకు ఎన్నుకుందో అని. మానవుడు సంఘజీవి. నా అన్నవారు పట్టించుకోకపోతే ఒంటరిగా బ్రతకడం కష్టం. ఆప్యాయత, అభిమానానికి తహతహలాడిపోతుంది మనసు.

సుధీర్ పెళ్లి తర్వాత అక్క వచ్చింది. పెళ్లికి ఎందుకు రాలేదని అడిగితే "మా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కొడుకు మెట్లమీంచి జారి పడిపోయాడు. ప్రాణాపాయంలో ఉన్నాడు. తన గ్రూప్ రక్తం బ్లడ్‌బ్యాంక్‌లో లేకపోవడం వల్ల నాకు తెలిసిన వారిని బ్రతిమాలి రక్తం ఇప్పించాను. తర్వాత ఆపరేషన్ జరిగింది. ఇప్పుడు కోలుకున్నాడు. అక్కడి పని ముగించుకుని ఇప్పుడు రాగలిగాను" అని చెప్పింది.

అక్క చెప్పిన కారణం నా కోపాన్ని రెట్టింపు చేసింది. పెళ్లి చాలా వైభవంగా చేసామని నేను అక్కకి ఎంతో గొప్పగా చెప్పాను. అక్క ఆసక్తిగానే అన్ని విషయాలూ వింది. అప్పట్లో నేను కోపగించినా నాకు ఇప్పుడు అనిపిస్తోంది. అక్క తన, పర అసూయద్వేషాలవంటి భావాలను జయించి మానవసేవే మాధవ సేవగా భావించి జీవిస్తున్నదని.

ఇక నుండీ నేను విశాఖలో మా ఇంట్లో ఉండను. అక్కతోనే కలిసి ఉంటూ, అక్క సేవ చేస్తూ, అక్కలాగే నాకు చేతనైనంత వరకూ ఇతరులకు సహాయపడుతూ బ్రతకడానికి ప్రయత్నిస్తాను. నేను మనసులో నిర్ణయించుకున్నాను.

నాకు ఇప్పుడు మనశ్శాంతిగా, హాయిగా ఉంది. ప్రశాంతమైన మనసుతో ప్రయాణం సాగించాను. ●